క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా రూ.13. వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 41, కాకర 38, బీర 45, క్యాలిఫ్లవర్ 23, క్యాబేజీ 11, కారెట్ 15. దొండ 35, ఆలు 20, ఉల్లి 14, గోకర 50, దోస 23, సొరకాయ 9, పొట్ల 13, అరటి 9, చిక్కుడు 60, అర్వి 50, మునగ 28, చిలగడదుంప 40, బీట్‌రూట్ 15, కీర 14, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 45. ఈధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు

హస్తినాపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న మజీదుల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు రంజాన్ కానుకలను కార్పొరేటర్ సుజాతనాయక్ అందజేశారు.

ఆలె నరేంద్ర ఆశయ సాధనకు కృషి



ఆలె నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: మాజీ కేంద్రమంత్రి దివంగత ఆలె నరేంద్ర ఆశయ సాధనకు కృషి చేస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నరేంద్ర వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా పనులు త్వరగా పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని పార్కులో రూ. 30 లక్షల నిధులతో చేపట్టిన కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్ పనులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

తండాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ నేతలు, తండా వాసులు

మహేశ్వరం: గ్రామాలకు దీటుగా గిరిజన తండాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం – మన్సాన్‌పల్లి వయా ఉప్పుగడ్డ తండాకు బీటీ రోడ్డు మంజూరు కావడంతో ఆదివారం ఉప్పుగడ్డ తండా వాసులు, బీఆర్ఎస్ నాయకులు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం – మన్సాన్‌పల్లి రోడ్డు నిర్మాణానికి రూ. 3.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ తండాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. తండాలకు పంచాయతీ హోదా కల్పించి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి వైపు నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహేశ్వరంలో బంజార భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మండలంలోని తండాలకు లింకు రోడ్ల నిర్మాణానికి రూ. 9.41 కోట్లు మంజూరు చేశామని, త్వరలో టెండర్లు పిలిపించి పనులు ప్రారంభిస్తామన్నారు. కేసీ తండా సమీపంలో ఎలక్ట్రానిక్ పార్కులో విప్రో, మలబార్ కంపెనీలు రాకతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. త్వరలో మరిన్ని భారీ కంపెనీలు ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు. అంతకు ముందు ఉప్పుగడ్డ తండాకు చెందిన పలువురు తమకు ఇళ్ల స్థలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయాలని మంత్రిని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. సబితారెడ్డిని కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్ జాన్‌రెడ్డి, సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు సీతారామ్ నాయక్, కేతావత్ రాజు నాయక్, సేవ్యా నాయక్, బన్సీలాల్ నాయక్, సురేష్ నాయక్, కల్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

ఇదేం చోద్యం



చంపాపేట చౌరస్తాలో బస్సులు ఆగే చోట బస్ షెల్టర్ ఏర్పాటు చేయని అధికారులు

- షెల్టర్ ఉంటే బస్సులు ఆగవు
- బస్సులు ఆగేచోట షెల్టర్ ఉండదు
- ఇదీ ప్రయాణికుల దుస్థితి

చంపాపేట: వేసవిలో ఎండల తీవ్రత భయపెడుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటితే ఇంటి నుండి బయటకు రావాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అయితే బస్సులో ప్రయాణించే ప్రయాణీకులకు ఆర్‌టీసీ, సర్కిల్ అధికారులు కల్పించే సౌకర్యాలు మాత్రం శూన్యం. చంపాపేట ప్రాంతంలో సర్కిల్ అధికారులు, ఆర్‌టీసీ సిబ్బంది నిర్లక్ష్యంతో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణీకులు ఇబ్బందులు పడాల్సివస్తుంది.

- బైరాముల గూడ చౌరస్తానుంచి ఐఎస్ సదన్ మార్గంలో.... బైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్, చంపాపేట, వడ్డెరబస్తి చౌరస్తా, సాయిరాం నగర్ ఆర్చి సమీపంలో షెల్టర్లు లేకపోవటంతో నడి రోడ్డుపైనే ప్రయాణీకులకు సుమారు వంద, మీటర్ల దూరంలో బస్సులు ఆగుతుండటంతో ప్రయాణికులు మండే ఎండలో ఉరుకులు పరుగులు తప్పటుంలేదని స్థానిక కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.
- గ్రీన్‌పార్క్ కాలనీఆర్చ్, చంపాపేట, గాయిత్రీ నగర్ చౌరస్తాలలో బస్సు షెల్టర్లు ఉన్నప్పటికీ స్టాప్‌కు అటో, ఇటో కొన్ని మీటర్ల దూరంలో బస్సులు నిలిపివేయడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు బస్సుల కోసం పరిగెత్తలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మీర్‌పేట, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, కటకోనికుంట, పోచమ్మగడ్డ వంటి పలుకాలనీవాసులు నెహ్రూనగర్ కాలనీ క్రాస్ రోడ్‌లోని రిక్వెస్ట్ బస్ స్టాప్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్‌ల రాకకోసం ఎదురు చూస్తూ ఉంటారు.
- చంపాపేట చౌరస్తాకు నిత్యం చుట్టుపక్కల సుమారు 50 కాలనీల ఉద్యోగులు, విద్యార్థులు, నగరంలో ఇతర పనుల కోసం వెళ్ళే ప్రయాణీకులు చౌరస్తాలోని డీమార్ట్ ముందు బస్‌ల కోసం చేరుతుంటారు. ఆప్రాంతంలో బస్ షెల్టర్ లేకపోవటంతో మండే ఎండలోనే బస్‌లకోసం పడిగాపులు కాయాల్సివస్తుంది. తీరా బస్‌లు వచ్చినా ప్రయాణికులు ఉన్న చోట బస్‌లు ఆగక పోవటంతో ఉరుకులు పరుగులు తప్పటంలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- ఓవైపు అత్యాధునిక బస్ షెల్టర్‌లు, బస్ బేలను అభివృద్ధి చేస్తూ ఏసీ బస్ షెల్టర్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రస్తుత పరిస్థితులలో ఇప్పటికీ ప్రయాణికులతో రద్దీ ఉన్న చంపాపేట, కర్మన్‌ఘాట్, నెహ్రూనగర్ క్రాస్‌రోడ్, వడ్డెర బస్తీ, వంటి పలు ప్రధాన చౌరస్తాలలో కనీసం బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేయక పోవటంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



చంపాపేట డీమార్ట్ ముందు బస్సు కోసం ఉరుకులు..పరుగులు



చంపాపేట శ్మశానవాటిక ముందు బస్ షెల్టర్ ఉన్నా ఆగని బస్సులు

దేశంలోనే నెంబర్‌వన్ సీఎం కేసీఆర్



పాతబస్తీలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ నెంబర్ వన్ సీఎంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేరుగాంచారని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం అజంపురాలోని అజం ఫంక్షన్‌హాల్‌లో పాతనగరంలోని మలక్‌పేట, యాకత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హోంమంత్రితో పాటు పార్టీ హైదరాబాద్ ఇన్‌చార్జ్ దాసోజు శ్రావణ్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో మేలు

బడంగ్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలని స్థానిక కార్పొరేటర్ ఆర్ కవిత అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్ తిరుమలనగర్ ఫేస్ –2లో సహస్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్ రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, నాయకులు అర్జున్, తిరుపతయ్య, యాదగిరి, దశరథ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి జిల్లాకు చెందిన విక్రం (31) ఉప్పల్‌లో నివాసముంటూ మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై నుండి మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని చౌరస్తా వైపు వస్తుండగా కామినేని చౌరస్తా బిగ్ బజార్ నుండి మాన్సూరాబాద్ వైపు వస్తున్న కారు ఎదురుగా వచ్చి విక్రమ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విక్రమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్‌బీనగర్ పోలీసులు కారు డ్రైవర్ శివ అలియాస్ నందను అరెస్టు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించండి



నిరాహారదీక్ష చేస్తున్న జనసేన ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ శిరీష పోన్నూరు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనసేన ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ శిరీష పొన్నూరు ఆదివారం శాంతియుత నిరాహారదీక్ష చేపట్టారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వాసవీ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త

దిల్‌సుఖ్‌నగర్: వేసవి కాలంలో ప్రజలదాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపతాయని వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త అన్నారు. ఆదివారం వాసవి కాలనీలోని బస్టాప్ వద్ద వాసవి కాలనీ ఆర్య వైశ్య సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి చంద్ర శేఖర్ గుప్త ప్రారంభిచారు.

మలక్‌పేట: ఆలే నరేంద్ర సేవాదళ్ ఆధ్వర్యంలో మూసారంబాగ్ మెట్రోస్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎండకాలంలో చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఎంతోగానో ఉపకరిస్తాయన్నారు.

హోం మంత్రికి సత్కారం



చార్మినార్: ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పురానాపూల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పెండ్యాల లక్ష్మణ్‌రావుతో పాటు చార్మినార్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు గోపీగౌడ్ తదితరులు ఆదివారం హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి సత్కరించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పుస్తే శ్రీకాంత్ పర్యవేక్షణలో ఇప్పటికే తమ తమ డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు మంత్రికి వివరించారు.

'కులాంతర వివాహం చేసుకున్నాడని వేధించారు'

- హస్తినాపురం యువతిని ప్రేమించిన యాదాద్రి జిల్లా యువకుడు
- యువతి కుటుంబసభ్యులు బెదిరించడంతో ఆత్మహత్య
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబసభ్యుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు



మృతుడు గోపీనాయక్ (ఫైల్)

హస్తినాపురం: కులాంతర వివాహం చేసుకున్నాడని అమ్మాయి కుటుంబ సభ్యులు వేధించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు ఆదివారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు.. హస్తినాపురం ఈస్ట్‌కాలనీకి చెందిన యువతి, యాదాద్రి భువనగిరి జిల్లా చిల్లాపురం పరిధిలోని డాకు తండాకు చెందిన గోపీనాయక్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఉన్నత చదువులకోసం లండన్ వెళ్లిన గోపీ 2021 నవంబర్ 30 తిరిగి వచ్చాడు. అదేసంవత్సరం డిసెంబర్‌లో యువతి తండ్రి నాగార్జున తప్పుడు కేసు పెట్టించి వేధింపులకు గురిచేశాడని వాపోయారు. ఇదిలా ఉండగా ఆరునెలల క్రితం యువతి, గోపీనాయక్‌లు వివాహం చేసుకోవడంతో ఆగ్రహించిన నాగార్జున.. గోపీనాయక్‌ను బెదిరించి తన కూతురుని తీసుకెళ్లాడని ఆరోపించారు. కూతురి జోలికి వస్తే చంపేస్తానని నాగార్జున బెదిరించే వాడని శనివారం కూడా బెదిరించాడని వాపోయారు. దీంతో భయభ్రాంతులకు గురైన గోపి నాయక్ (26) రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఆరోపించారు. ఆదివారం ఉదయం నుంచీ పోలీస్‌స్టేషన్ ముందు కూర్చుని నాగార్జున కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసినా పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంస్థాన్ నారాయణపురం మాజీ మండల అధ్యక్షురాలు బుజ్జినాయక్ ఆరోపించారు. ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని లేదంటే తాము ఇక్కడనుండి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి గోపీనాయక్ ఆత్మహత్యకు బాధ్యులైన నాగార్జున కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు తోపాటు ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడంతో ధర్నా విరమించుకున్నారు. గోపీనాయక్ తండ్రి జగ్రునాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రంజాన్ కానుకల పంపిణీ



వనస్థలిపురంలో ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలోని మజీద్ ఈ క్యూబా లో ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ కానుకలను ఆదివారం స్థానిక కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై ముస్లిం సోదరులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ముదుపు సందీప్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపి, కిషోర్, మజీద్ అధ్యక్షులు ఆదిల్ పాషా, సభ్యులు సత్తార్, మీర్జాఅలీ, అబ్దుల్ ఆలీమ్ తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్: రంజాన్ పండుగను పురస్కరించుకుని మన్సూరాబాద్‌లోని అక్బర్–ఎ–సిద్దిఖీ (పెద్దమసీదు)లో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

నాగోలు డివిజన్‌లో..

నాగోలు: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు అందజేసే రంజాన్ తో ఫా కీట్లను ఆదివారం నాగోలు డివిజన్ జైపురికాలనీ మసీదులో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పవిత్ర దైవ గ్రంథం ఖురాను అవతరించినది 'రమదాన్' మాసంలోనే రంజాన్ పండుగ కు మరో పేరు ఈద్ ఉల్ ఫిత్ర ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి:

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: పవిత్ర రంజాన్ మాసం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కామేశ్వరరావు కాలనీలో ఉన్న మసీదు ఈ క్యూబా నందులో ముస్లిం సోదరమణులకు ఆదివారం రంజాన్ దుస్తులను పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి దోహదం చేస్తాయి

వనస్థలిపురం: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి దోహదం చేస్తాయని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి వనస్థలిపురం గురుద్వార్ రోడ్డులో ఏ.డీ.వీ.ముదబ్బీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



రంజాన్ కానుకలను అందజేస్తున్న కార్పోరేటర్ మెద్దు లచ్చిరెడ్డి



రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

హయత్‌నగర్: రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో శాంతి యుతంగా జరుపుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్‌లోని హయత్‌బక్షి మజీద్(పెద్ద మజీదు)లో ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పండుగల కానుకల పేరుతో టీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెనుకేసుకుంటుందని నాసిరకమైన దుస్తులు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయం



ఈస్టర్ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వరరావు



వనస్థలిపురం లిటిల్ ల్యాంబ్ చర్చిలో భక్తిగీతాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శౌరిబాబు తదితరులు

ఎమ్మెల్సీ రాజేశ్వరరావు


సైదాబాద్: కరుణామయుడైన జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయమని ఎమ్మెల్సీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం శంకేశ్వరబజార్‌లోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో యాకత్‌పురా పాస్టర్స్, క్రిస్టియన్ లీడర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నల్లిమెల్లి మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ సన్‌రైజ్ ఆరాధన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసుక్రీస్తు చూపిన దయ, క్షమ, ప్రేమ గుణాలను చాటాలన్నారు. హెచ్‌పీఎఫ్ మినిస్ట్రీస్ సిస్టర్ జ్యోతీ రాజేశ్వరరావు, గ్లోబల్ బంజారా బాప్టిస్ట్ మినిస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా వేడుకలు...

గుడ్ ఫ్రైడే నాడు శిలువపై మరణం పొందిన యేసు క్రీస్తు పునరుత్థానం చెందిన పర్వదినమే ఈస్టర్ అని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఆర్. భీముడునాయక్ వివరించారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణికాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఆదివారం పునరుత్థాన ఆదివారపు ఆరాధనా (ఈస్టర్ సన్ డే) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెవ డా. కోన శౌరీబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణమును జయించి తిరిగి పునరుత్థానుడైన రోజున ఈస్టర్ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. క్రీస్తు సందేశం అందరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తిగీతాల పుసకాన్ని ఆవిష్కరించారు.



మూసారంబాగ్ బేతనియ చర్చిలో స్తుతి గీతాలు ఆలపిస్తున్న పాస్టర్ సామేల్ బాబు



క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్

కర్మన్‌ఘాట్‌లో...

కర్మన్‌ఘాటలోని నిత్యజీవ మందిరంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎపఫ్రా మాట్లాడుగు ఏసు ప్రభువు పునరుత్థానుడై ఈ లోకానికి, మానవాళికి జీవం జీవం ప్రసాదించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చిల్లో ఈస్టర్ వేడుకలు

మలక్‌పేట: నియోజకవర్గ పరిధిలో ఉన్న చర్చిలలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు పునరుత్థానమైన ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వ్యక్తిగతంగా, సామూహికంగా యేసుక్రీస్తు పాటలతో స్తుతించి ఆరాధించారు.



సింగరేణికాలనీ ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో వేడుకల్లో పాల్గొన్న క్రిస్టియన్ సోదరులు